
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 1 అక్టోబరు 2024 | 5



కప్.. ప్రత్యేకమే..

కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్ ఉంది. పూర్వం కాఫీ ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత లోటాల్లో.. ఆ తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పుసాసర్‌లో కొంతకాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండితీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదందోయ్.. అభిరుచి మేరకు తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీప్రియుల ఉవాచ.





ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

ప్రారంభమైన ఓటరు నమోదు ప్రక్రియ

- నవంబరు 6 వరకు ఓట్ల నమోదు
- 2025 మార్చిలో ఎన్నికలు
- రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు సిద్ధం
- అమరావతి కేంద్రంగా ప్రయత్నాలు



(అమలాపురం-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి మొదలైంది. సోమవారం నుంచి ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. పట్టభద్రులైన ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభమైంది. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఆశావహులైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సోమవారం నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఓటర్లు నమోదు చేసుకోవచ్చు. 2019లో జరిగిన ఎన్నికల్లో 2.93 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1.92 లక్షల మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2025 మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి 3 లక్షలకు పైగా ఓటర్లు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఓటు నమోదు ఇలా..

డిగ్రీ పూర్తి చేసిన ఎవరైనా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపట్టడానికి రెవెన్యూ అధికారులు అవకాశమిచ్చారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇంటికి నేరుగా అధికారులు వచ్చి ధ్రువపత్రాలను అందజేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలన చేస్తారు. ఫామ్-18ను తీసుకుని వివరాలు పూరించి ఆధార్‌కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్సు, నివాస ధ్రువపత్రం వీటన్నింటినీ కలిపి సెట్‌గా చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందించాలి. లేదా మీ సేవ కేంద్రాల్లో కూడా నమోదు చేసుకోవచ్చు. ప్రస్తుతం కొత్తగా పట్టభద్రులైన వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహులైన అభ్యర్థులు కూడా కొత్త ఓటర్లను చేర్పించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు.

పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు సిద్ధం

వివిధ రాజకీయ పార్టీల తరుపున పోటీ చేసేందుకు ఆశావహులైన అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు అమరావతి కేంద్రంగా లాబీయింగ్‌లు నడుపుతున్నారు. తెలుగుదేశం పార్టీ తరపు నుంచి ఐ.పోలవరం మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు పేరాబత్తుల రాజశేఖర్, అమలాపురం పట్టణానికి చెందిన మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణరావు తనయుడు మెట్ల రమణబాబు టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక జనసేన నుంచి అమలాపురం పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్ జనసేన పార్టీ తరపున ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. వీరితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన మరికొంతమంది నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగనున్నట్టు సమాచారం. వీరితో పాటు వైసీపీ, కాంగ్రెస్‌లతో పాటు ఉపాధ్యాయ సంఘాల నుంచి కమ్యూనిస్టు పార్టీల నుంచి కూడా ఆశావహులైన అభ్యర్థులు ఎన్నికల్లో దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

6 సర్కిళ్లు 150 మద్యం షాపులు

- నూతన ఎక్సైజ్ పాలసీ అమలుకు సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్ష

అమలాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు ఎక్సైజ్ సర్కిల్ పోలీసుస్టేషన్ల పరిధిలో 150 మద్యం షాపులు ఏర్పాటుకు గుర్తించినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అమర్‌బాబు తెలిపారు. 2024-26 నూతన ఎక్సైజ్ పాలసీ అమలుకు అబ్కారీ శాఖ సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు, డీఎస్పీలతో నూతన మద్యం పాలసీ అమలుపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు సర్కిళ్లలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. పది మంది డిజిటల్ అసిస్టెంట్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల సరఫరా, స్వీకరణ ప్రక్రియ కోసం నియమించామన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ మాట్లాడుతూ ఔత్సాహిక దుకాణదారులు షాపుల నిర్వహణకు సంబంధించి లైసెన్సు ఫీజు డిపాజిట్ చెక్కులు ఒరిజినలా డూప్లికేటా అనే కోణంలో నిశిత పరిశీలన కోసం ఆరుగురు బ్యాంకు సిబ్బందిని ఆరు సర్కిళ్లలో నియమిస్తామన్నారు. గత మూడేళ్లగా మద్యం దుకాణాల్లో అమ్మకాల గణాంక వివరాలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేటు మద్యం వ్యాపారంలోకి మారుతున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి శాంతి భద్రతల సమస్యలు రాకుండా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నిలిచిపోయిన బ్రాండెండ్ మద్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. లైసెన్సు ఫీజులను ఇప్పటికే ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు. రెండేళ్ల కాలపరిమితితో మద్యం దుకాణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఎస్పీలు రామకృష్ణప్రసాద్, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



ఈ బస్‌లు వస్తున్నాయ్!

ఉమ్మడి జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సులు పరుగు

ఇప్పుడంతా ఈవీ (ఎలక్ట్రికల్ వాహనాల)ల శకం నడుస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఇప్పటికే ఎక్కడ చూసినా ఈ-బైక్ హవా కనిపిస్తోంది. ఖర్చు భారీగా తగ్గుతుందనే కారణంతో వ్యక్తులు, కంపెనీలు ఈ-వాహనాల వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్న పరిస్థితి. ఈ బాటలోనే ఆర్టీసీ కూడా పయనిస్తోంది. ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంది. ఇప్పటికే తిరుపతి, విజయవాడలాంటి ప్రాంతాల్లో ఆర్టీసీ వీటిని నడుపుతోంది. - కాకినాడ, ఆంధ్రజ్యోతి

- ఆర్టీసీకి 150 కొత్త బస్సులు
- ఒక్కో బస్సురూ.1.50 కోట్ల ఖర్చు
- రూ.225 కోట్లతో కొనుగోలు
- కాకినాడ జిల్లాకు 50
- తూర్పుగోదారి జిల్లాకు 100
- 3 జిల్లా రూట్లలో తిప్పేలా ప్లాన్
- 25 వరకు ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు ఆదా అని అంచనా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఇప్పటివరకు ఎలక్ట్రికల్ బస్సులు లేవు. దీంతో దూర ప్రాంత రూట్లకు ఇంధనంతో నడిచే బస్సులే కాకుండా భవిష్యత్తులో ఈవీ (ఎలక్ట్రికల్) బస్సులు నడిపేందుకు ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు రూ.225 కోట్లతో 150 కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 చొప్పున అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటికోసం ఉమ్మడి జిల్లాలో 25 వరకు ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు.

ఎలక్ట్రిక్ పరుగులతో లాభాలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందలాది బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. డీజిల్ ధరలు పెరగడంతో ఆర్టీసీ నష్టాలే చవిచూస్తోంది. దీంతో ఖర్చులు నియంత్రించుకోవాల్సిన అవసరత ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులకు దగ్గరయ్యేందుకు త్వరలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సిద్ధమవుతోంది. తద్వారా ఖర్చు తగ్గించుకోవడంతోపాటు ఆధునిక రవాణా అందిపుచ్చుకున్నట్టు అవుతుందని భావిస్తోంది. ఇటీవల రవాణా శాఖ మంత్రి రాజమహేంద్రవరం వచ్చినప్పుడు ఆర్టీసీ అధికారులతో ఈ విషయంపై చర్చ జరిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు తెలిపారు.

మలిదశలో అమలాపురానికి..

వాస్తవానికి ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర రూ.1.50 కోట్లు. ఈ లెక్కన 150 బస్సులకు దాదాపుగా రూ.225 కోట్ల వరకు ఖర్చవనుంది. ఉమ్మడి జిల్లాలో 150 ఎలక్ట్రికల్ బస్సులను ఏయే రూట్లలో తిప్పాలనేదానిపై ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తిచేశారు. కాకినాడ జిల్లా కేంద్రం డిపో నుంచి నడపనున్న 50 బస్సుల్లో కొన్ని కాకినాడ- అమలాపురం, కాకినాడ-రాజమహేంద్రవరం, కాకినాడ-తుని రూట్లలో నడపాలని భావిస్తున్నారు. రాజమహేంద్రవరం డిపోనుంచి కాకినాడ, తుని, అమలాపురం, ఏలూరు, విశాఖపట్నం వరకు నడపాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మలిదశలో కొత్త బస్సులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఎలక్ట్రికల్ బస్సుల ప్రతిపాదనలు వెళ్లడంతో అన్నీ కలిపి ఒకేసారి టెండర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆలోచిస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాదిలోగా ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో టికెట్ ధరలు బాగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 150 ఎలక్ట్రికల్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్లకు భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 25 వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు అమలాపురం, తుని పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి బ్యాటరీ బైక్‌కు కనీసం ఆరు గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనేగానీ బ్యాటరీ ఫుల్ కాదు. రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి కాబట్టి రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే

కాస్త.. ఫీలింగ్!



కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలామందికి రోజు ఆరంభమేకాదు. కాఫీ గొంతులో పడనిదే మంచం దిగని వారెందరో. ఇదేంటి పొద్దున్నే అన్నామనుకోండి.. బెడ్ కాఫీ మహిమ మీకేం తెలుసంటారు. రీఫ్రెష్ అవ్వాలంటే కాఫీ ఒక్కటే మందు అని వాదించే కాఫీ క్లబ్ బ్యాచ్‌లూ ఉన్నాయి. ఇదివరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఈ కాఫీలు ఓల్డ్. ట్రెండ్‌కు అనుగుణంగా కాఫీ రకాలెన్నో వచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీడేకో, మరో కాఫీషాప్‌కో వెళితే ఇవన్నీ కాఫీలేనా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. నేడు కాఫీ డే సందర్భంగా ఒక్కసారి ఆ కాఫీ రుచి చూసేద్దాం.. కాస్త.. ఫీలింగ్ ఆస్వాదిద్దాం!



- కొత్త కొత్త రకాల్లో కాఫీ
- కాఫీ సాగు కేరాఫ్ మన్యం

కాఫీ.. ఉషోదయాన ఉత్తేజం కలిగించే గమ్మత్తైన పానీయం. కాఫీ.. అనే రెండక్షరాల పదం వినగానే ప్రాణం లేసొచ్చిందనే నానుడి వింటూనే ఉంటాం. ఇష్టాయిష్టాలు చాలామందివి కలుస్తూ ఉండొచ్చుగానీ, కాఫీప్రియులకు పెద్దగా పరిచయాలతో పనిలేదు. ఎవరినైనా ముచ్చట్లలో ముంచెత్తేంతగా దగ్గర చేసేది కాఫీ మాత్రమే. అందుకే కాఫీ కబుర్లు అని దానికో నిక్‌నేమ్ పెడుతుంటారు. పెద్ద పెద్ద చర్చలు కూడా కాఫీ టేబుల్ దగ్గరే జరుగుతుంటాయనీ వింటుంటాం. కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగుచేస్తుండగా, మన మన్యంలో కూడా కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. 1898లో బ్రిటిష్ అధికారి 'బ్రాడీ' తూర్పు కనుమల పరిధిలోకి వచ్చే మన ఏజెన్సీ మారేడుమిల్లి దగ్గర పాములేరు లోయలో కాఫీ పంట సాగులోకి వచ్చిందని చెబుతారు. ఇక్కడి నుంచే అరకు ప్రాంతానికి సాగు విస్తరించింది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడిచేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారుచేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడివేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్ కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

ఆంధ్రా ఫేమస్ శొంఠి కాఫీ

రాజమహేంద్రవరం సిటీ : కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ అనే రకం అందులో ఒకటి. విదేశాల నుంచి తెచ్చిన కాఫీ గింజలతో కాఫీ తాగడం మొదలుకాక ముందు నుంచే ఈ శొంఠి కాఫీ వినియోగంలో ఉందని చెబుతారు. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారుచేయడంలో మన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధహస్తులు. శుభ్రపరిచిన శొంఠి 20 గ్రాములు తీసుకుని దాన్ని మిక్సీలో వేసి మెత్తని పౌడరుగా తయారుచేసుకోవాలి. అలాగే 10 గ్రాములు మిరియాలు తీసుకుని దాన్ని కూడా మెత్తగా తయారుచేసుకోవాలి. అదేవిధంగా 10 గ్రాముల బెల్లం తీసుకుని దాన్ని మెత్తగా తయారుచేసి గిన్నెలో ఉంచాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదుని మిషాలపాటు మరిగించి దానిని వడగట్టి మరొక గిన్నెలో వేయాలి. తర్వాత రెండు కప్పుల పాలను తీసుకుని స్టవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లంపొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే. శొంఠి కాఫీ తాగడం వల్ల దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ కాస్ట్‌లీ.. టేస్టీ



కార్పొరేషన్(కాకినాడ) : కాఫీలో రకరకాల ఫ్లేవర్లు, కొత్త రుచులను నేటి తరం ఆస్వాదిస్తోంది. ఉమ్మడి తూర్పు పరిధిలో కొత్తరకం మెట్రో కాఫీ షాపులు వెలిశాయి. మనకి మార్కెట్‌లో లభ్యమయ్యే కాఫీలు వేరు.. ఇక్కడ దొరికేవి వేరు. ఇక్కడ ఉండే హాట్, కోల్డ్, వెరైటీ కాఫీ రుచులు, వాటి ధరలు...

క్యాపిచినో	- రూ.238(350ఎంఎల్)
కాఫీ లట్టే	- రూ.248(350ఎంఎల్)
ఎస్ప్రెస్సో	- రూ.152(30ఎంఎల్)
డబుల్ ఎస్ప్రెస్సో	- రూ.210(60ఎంఎల్)
క్లాసిక్ అఫోగతో	- రూ.257(120ఎంఎల్)
ఫ్లేవర్డ్ అఫోగాటస్	- రూ.276(150ఎంఎల్)
హనీ సిన్నమోన్ కాఫీ	- రూ.200(180ఎంఎల్)
మోచా కాఫీ	- రూ.238(210ఎంఎల్)
ఐరిష్ కాఫీ	- రూ.248(200ఎంఎల్)
సిగ్నేచర్ కోల్డ్ కాఫీ	- రూ.257(300ఎంఎల్)
డెవిల్స్ ఒరిజినల్ కాఫీ	- రూ.310(350ఎంఎల్)



మన్యం కాఫీకి.. మహా డిమాండు

కాఫీ అంటే గుర్తొచ్చే మన బ్రాండ్ అరకు కాఫీ. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. దేశంలో కేరళ తర్వాత కాఫీ పంటకు మన రాష్ట్రంలోని తూర్పుకనుమలు ప్రత్యేకమైనవి. సముద్రమట్టానికి వెయ్యి నుంచి 1250 అడుగుల ఎత్తున ఉండి తోటల పెంపకానికి అనువుగా ఉంటుంది. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాంతంలో కేంద్రం కాఫీ ప్రాజెక్టుకు ప్రోత్సాహన్నిచ్చింది. మారేడుమిల్లి, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలు సముద్రమట్టానికి 1200 నుంచి 1500 అడుగుల ఎత్తులో ఉండడంతో ఇక్కడ కాఫీ తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రంప మన్యంలో కావేరీ రకం పంట హెక్టారుకు 3వేల కిలోల ముడి కాఫీ పిక్కలను ఇస్తోంది. కాఫీ మొక్క సాధారణంగా ఆరో ఏట నుంచి దిగుబడిని ఇస్తుంది. ఆరేళ్లపాటు ఎకరాకు మొత్తం రూ.28 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఏజెన్సీలో ఒక్క మారేడుమిల్లి మండలంలో మాత్రమే ఇప్పుడు సుమారు 300 ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. జీసీసీ మార్కెటింగ్ చేసే అరకు బ్రాండ్ కాఫీలో ఇక్కడ పండించిన కాఫీ కూడా చేరుతోంది. 2007-08 సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం ఐటీడీఏకు 12 వేల ఎకరాల్లో కాఫీ అభివృద్ధికి రూ.28 కోట్లు కేటాయించింది. అయితే ఆ దిశగా ఐటీడీఏ సరైన ప్రణాళిక అమలు చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు అమలుకు నోచుకోలేదు. ఆ నిధులూ మురిగిపోయాయి. కాఫీ సాగుకు పూర్తి అనుకూలమైన మారేడుమిల్లి మండలంలో సుమారు 20వేల ఎకరాల భూమి రైతుల చేతిలో ఉండగా ఇందులో కేవలం 30 నుంచి 50 శాతం భూములు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ఆయా భూముల్లోను, గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూముల్లోనూ వారికి ఆదాయాన్నిచ్చే కాఫీ పంటను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. - రంపచోడవరం

సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్
- 230 అర్జీలు స్వీకరణ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సామాజిక సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా సమగ్రమైన పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎం.ఝాన్సీరాణి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ 230 అర్జీలను స్వీకరించారు. నిర్దేశిత గడువులోగా అర్జీలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల నుంచి జేసీ నిషాంతి నేరుగా వారి వద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, డీఎస్వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ పీకేపీ ప్రసాద్, వికాసా జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

సామాజిక బహిష్కరణపై ఫిర్యాదు

గోపాలపురానికి చెందిన 60 కుటుంబాలను అదే సామాజిక వర్గానికి చెందిన వారు వెలివేసి కుల బహిష్కరణ చేసినట్టు సబ్బితి మోహనరావుతో పాటు ఆయా కుటుంబాల వారు కలెక్టర్‌కు అర్జీ అందించారు. తమను ఏవిధమైన శుభ కార్యక్రమాలకు పిలవడం లేదని సంఘ పరంగా వచ్చే ప్రయోజనాలు చేకూరకుండా అడ్డు తగులుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్జీ అందించిన వారిలో పమ్మి ప్రభాకరరావు, పి.ప్రకాశం, బొక్కా ఏసు, జి.సత్యనారాయణ, కె.రాంబాబు ఉన్నారు.

పురపాలక సంఘంలో అవినీతి మేటలు

కలెక్టరేట్ ఎదుట టీడీపీ, జనసేన కౌన్సిలర్ల నిరసన

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: అమలాపురం పురపాలక సంఘంలో అవినీతి మేటలు పెరిగిపోయాయని మున్సిపల్ అధికారులు, అధికార వైసీపీ కౌన్సిలర్లు కుమ్మక్కై ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పురపాలక సంఘంలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అర్జీ అందించారు. ఈ ఏడాది ఆగస్టు 27న జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో 2, 3, 4, 5 అంశాల తీర్మానాలను ఆమోదించకుండా వాయిదా వేసినప్పటికీ మినిట్స్ బుక్‌లో ఆమోదించినట్టు రాసి వర్కు ఆర్డర్లు ఇచ్చిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్‌లో రూ.24వేలకు జనరేటర్ అద్దెకు లభిస్తుంటే ప్రతీ నెల రూ.68వేలు బిల్లులు చెల్లిస్తున్నారని, తక్షణం ఇటువంటి వ్యవహారాలపై విచారణ జరపాలని కలెక్టర్‌ను ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, కౌన్సిలర్లు అబ్బిరెడ్డి చంటి, బొర్రా చిట్టిబాబు, పిండి అమరావతి, గండి దేవీహారిక, పడాల శ్రీదేవి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: నూరు శాతం పెన్షన్ల పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. 1వ తేదీనే పెన్షన్ల బట్వాడా పూర్తి చేసే విధంగా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారన్నారు. అక్టోబరు 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద జిల్లాలో 2,40,267 మంది లబ్ధిదారులకు రూ.99,80,85,500 పెన్షన్ల నగదు బట్వాడా చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ఒక్కో వ్యక్తి 57 పెన్షన్లు సగటున పంపిణీ చేయడంతో పాటు ఒక్కో సెక్రటేరియట్ పరిధిలో 470 పెన్షన్లు బట్వాడా చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం 4231 మందిని ప్రత్యేకంగా నియమించామన్నారు. సచివాలయాల పరిధిలోని 4100 మంది ఉద్యోగులతో పాటు ఇతర విభాగాలకు చెందిన 131 మంది పెన్షన్ బట్వాడాకు నియమించామని ఈ సందర్భంగా పీడీ తెలిపారు.

చిరుత జాడ కానరావడం లేదు

జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రసాద్

వార్త..7లో

'నన్నయ' బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సుబ్బారావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా విద్యా కళాశాల చైర్మన్ ఆచార్య కె.సుబ్బారావు నియమితులయ్యారు. సభ్యులుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ టీజీ అమృతవల్లి, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ ఎస్.విజయవర్ధిని, గోకవరంలోని హన్నా విద్యా కళాశాల కరస్పాండెంట్ బి.సువర్ణకుమార్, ముక్తేశ్వరంలోని ఎస్‌కేఎం విద్యా కళాశాల ప్రిన్సిపాల్ వైవీ జగన్నాథ్, నర్సాపురంలోని శ్రీజీవీఆర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పి.శాంతి, రాజమహేంద్రవరం ఎస్‌జీఎస్ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్, మరో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వీరంతా మూడేళ్ల పాటు కొనసాగుతారని చైర్మన్ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ నుంచి నియామక పత్రం అందుకున్నట్టు ఆయన చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యా కళాశాలలు మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ సుబ్బారావు చెప్పారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రారంభం

నవంబరు 6 ఆఖరు తేదీ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జిల్లాలో గ్రాడ్యుయేషన్ (డిగ్రీ) పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. వచ్చే మార్చి నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కానుండడంతో ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు ఒకటో తేదీకి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసుకున్నవారు దీనిలో ఓటు నమోదుకు అర్హులుగా పేర్కొన్నారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన ఓ ఉల్లి లోడు లారీ

ఉల్లిపాయల లారీలు బోల్తా

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 30: కాకినాడ జిల్లాలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఎర్రకోనేరు వద్ద రెండు ఉల్లిపాయల లారీలు ఢీకొన్నాయి. సోమవారం విజయవాడ నుంచి అనకాపల్లి ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో ఉల్లిపాయల లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రెండు లారీలు బోల్తాపడగా డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనాస్థలంలో ఉల్లిపాయలు మూటలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో వాటి కోసం స్థానికులు ఎగబడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అడ్డుకుని ఉల్లిపాయల బస్తాలను మరో లారీలో నింపి తరలించే చర్యలు చేపట్టారు.



జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు

'కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి'

మోతుగూడెం, సెప్టెంబరు 30: జెన్‌కోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆ సంస్థ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావును కోరారు. వారికి 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. పదేళ్ల పూర్తయిన హైస్కిల్డ్ కార్మికుడికి రూ.1,000, స్కిల్డ్ కార్మికుడికి రూ.800, అన్‌స్కిల్డ్‌కి కార్మికుడికి రూ.500 ఇన్సెంటివ్ పెంచాలన్నారు. అప్పర్ సీలేరు జెన్‌కో పరిధిలో ఓఅండ్ఎంలో పనిచేస్తున్న 12 మంది, మోతుగూడెం సివిల్ క్యాంపు, ఫోర్‌బే సెక్షన్‌లో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని పీస్ వర్క్ నుంచి మ్యాన్‌పవర్‌గా చేస్తూ ఇచ్చిన ఎస్టిమేట్‌లను అమలు చేయాలన్నారు. జెన్‌కో ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు వైద్య సేవలు అందజేయాలని కోరారు.



ఎన్టీఆర్ ట్రస్టు సేవల ప్రారంభ సభలో మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి

తోబుట్టువులా ఆదరించారు

- బాధలో ఉన్నప్పుడు ధైర్యమిచ్చారు
- రాజమండ్రి ప్రజలను మరవలేను
- వారికి నా పాదాభివందనాలు
- నారా భువనేశ్వరి
- రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: 'నేను, నా కోడలు 53 రోజులు ఇక్కడ ఉన్నాం. ఎంతో బాధతో ఉన్నా ఇక్కడి ప్రజలు ఆదరించి, ధైర్యం ఇచ్చారు. ఇల్లు కూడా ఇచ్చి అండగా నిలబడ్డారు. రాజమండ్రి వాసులు నన్ను తోబుట్టువులా ఆదరించారు. వారిని ఎప్పటికీ మరవలేను. వారందరికీ నా కృతజ్ఞతలు. నా పాదాభివందనాలు' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లో డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న గోరంట్ల శాంతారావు (జీఎస్ఆర్) మెమోరియల్ ఫౌండేషన్‌లో ఎన్టీఆర్ ట్రస్టు 4వ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ తమకు ఆశ్రయమిచ్చి, అండగా నిలిచిన నన్ను ముందుకు నడిపించిన నా కుటుంబ సభ్యులు ఈ ప్రజలు. వారిని తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. రాజమండ్రి దాతల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. రాజకీయాలు తెలియని నాకు ఇక్కడ 'నిజం గెలవాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లేటట్టు ఈ ప్రజలు ప్రోత్సహించారన్నారు. రాజమండ్రిలో ఉన్నప్పుడు మీడియా ఇచ్చిన సహకారాన్ని మర్చిపోలేమన్నారు. ఈలోపు కొందరు జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యమివ్వాలని, ఇక్కడ ఇవ్వలేదని చెప్పడంతో తప్పకుండా వచ్చేలా చేస్తామని ఆమె చెప్పారు.

డాక్టర్లతో మాటామంతీ

గోరంట్ల రవిరామ్‌కిరణ్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ చైర్మన్ గన్ని భాస్కరరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరాజు తదితరులతో ఎన్టీఆర్ ట్రస్టు చేసే సేవలపై భువనేశ్వరి మాట్లాడారు. పేదలకు సేవ చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. అంతకు ముందు ఆమె అంబులెన్స్‌ను, కోలమూరులో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నందరాడకు చెందిన పూజా ప్రవల్లిక (12), గోకవరానికి చెందిన మహిదికాంత్ (3)లను వారి బంధువులు భువనేశ్వరి వద్దకు తీసుకురాగా వైద్య సహాయ కోసం మాట్లాడారు. ఈ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు ఇచ్చి పంపించారు.

ట్రస్ట్ ద్వారా సేవ చేసేది ఎన్టీఆర్ ట్రస్టే: ఎమ్మెల్యే గోరంట్ల

అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, టీడీపీ మాత్రమే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో సేవ చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. భువనేశ్వరి ట్రస్టు ద్వారా అనేక సేవలు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, సీవో గోపి, జీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. నారా భువనేశ్వరి స్వయంగా ఇక్కడ బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ సేవలందించనున్నారు. ఇక్కడ బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్ అందుబాటులో ఉంటాయి. హోల్ బ్లడ్ (డబ్ల్యుబి), ప్యాక్డ్ రెడ్‌బ్లడ్ సెల్స్ (పీఆర్‌బీసీ) ర్యాండమ్ డోనర్ ప్లేట్‌లెట్ (ఆర్‌డీపీ), ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్ఎఫ్‌పీ), క్రయో ప్రెసిపిటేట్ (సీఆర్‌వైవో), సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ), లికోడిప్లాటెడ్ ప్యాక్డ్ రెడ్‌బ్లడ్ సెల్స్ (ఎల్‌డీపీఆర్‌బీసీ), సెలైన్ వాష్ వంటివి ఇక్కడ లభ్యమవుతాయని డాక్టర్ రవిరామ్‌కిరణ్ చెప్పారు.



బ్లడ్ బ్యాంక్‌ను, అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి







సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, హాజరైన సైన్స్ ఉపాధ్యాయులు

విద్యార్థులకు అవసరమైన సాంకేతికత అందించాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 30: విద్యార్థులకు అవసరమైన సాంకేతికతను అందించాలని కాకినాడ జేఎన్టీయూ ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి, పాఠశాల విద్యా శాఖ, జేఎన్టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో 'సైన్స్ బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు' అంశంపై రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 340 మంది సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన బోధనతో అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. నూతన బోధనా పద్ధతుల ఆవిష్కరణలతో విద్యార్థులను అభ్యసనం పట్ల ఆకర్షించగలమని తెలిపారు. డీఈవో పిల్లి రమేష్, ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ మాట్లాడుతూ ఈ శిక్షణ చాలా వినూత్నమైనదన్నారు. 'ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం-పరిశోధనా పద్ధతి' అంశాన్ని డాక్టర్ ఎన్.శ్రీనివాస్ వివరించారు. జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఎం.రమేష్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలను తెలిపారు. సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి సైన్స్ బోధనలో యాప్స్ ఆవశ్యకతను వివరించారు. సైన్స్ విద్యలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడాన్ని డాక్టర్ బాలాజీ తెలియజేశారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, ఎంఈవో సీహెచ్ రవి, సమన్వయకర్తలు రాజారావు, శ్రీనివాస్, కృష్ణారావు, వాకాడ వెంకటరమణ, గోవిందరాజులు పాల్గొన్నారు.





కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికల ప్రారంభ సభలో పాల్గొన్న అధికారులు, వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 30: రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపికను సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, రగ్బీ ఆటల్లో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 3వేల మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేష్, కార్యదర్శి, చక్రవర్తి, కాకినాడ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి, ఏవీ శ్రీనివాస్, వి.రవిరాజు పాల్గొన్నారు.



స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 30: ప్రజలందరూ స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం 'స్వచ్ఛత హి సేవ' నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం జాతిపిత మహాత్మాగాంధీ 151వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ప్రజలంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విజన్-2047 కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండాతమ వంతుగా అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మానవహారం నిర్మించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, యువతీ, యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హుండీల ద్వారా సమకూరిన ఆదాయాన్ని పర్యవేక్షిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.78.54 లక్షలు

అన్నవరం, సెప్టెంబరు 30: రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 28 రోజులకు రూ.78,54,428 నగదు, 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి సమకూరాయి. యూఎస్ఏ డాలర్లు 800, సౌదీ అరేబియా రియల్స్ 400, ఒమెన్ బైసాలు 600 లభించాయి. సిబ్బంది లెక్కించగా ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు.



శివ సదన్ కాటేజీపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

సత్యగిరిపై సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు వేగవంతం

అన్నవరం, సెప్టెంబరు 30: అన్నవరం దేవస్థానం పరిధిలోని సత్యగిరి కొండపై హరిహర సదన్, విష్ణు సదన్, శివ సదన్ కాటేజీలపై సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. సుమారు రూ.3.15 కోట్లతో చేపట్టిన ఈ పనులను దేవదాయ శాఖ మంత్రితో ప్రారంభింపజేయాలని అధికారులు యోచిస్తున్నారు. దీనిద్వారా ఏటా 9లక్షల యూనిట్ల విద్యుత్ సరఫరా ఉత్పత్తి అవుతుందని, 0.6 మెగావాట్ల సామర్థ్యంతో నెడ్‌క్యాప్ సంస్థ పనులు చేపడుతుందని దేవస్థానం విద్యుత్ విభాగం డీఈ విశ్వనాదుల సత్యనారాయణ చెప్పారు.

కలెక్టర్ ఫొటోతో వాట్సాప్ డీపీ

డబ్బులు పంపాలని తహసీల్దార్లకు మెసేజ్
అధికారవర్గాల్లో కలకలం
ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దని కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఫొటోతో ఒక అజ్ఞాత వ్యక్తి వాట్సాప్ డీపీ పెట్టుకుని జిల్లాలోని తహసీల్దార్లను డబ్బులు పంపాల్సిందిగా కోరడం అధికారవర్గాల్లో సోమవారం కలకలం రేపింది. జిల్లాలోని తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు తహసీల్దార్లకు డబ్బులు అర్జెంటుగా పంపాలని సంబంధిత వ్యక్తి మెసేజ్‌లు పంపాడు. దీంతో ఆయా తహసీల్దార్లు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన ఆయన అలాంటి ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దని ఆదేశాలు ఇచ్చారు. అధికారుల గ్రూపులో కూడా ప్రత్యేకంగా కలెక్టర్ సూచనలు పంపారు. ఫేక్ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

అక్కడన్నారు... ఇక్కడన్నారు

లంక పొలాల్లో చిరుత పులి కనిపించిందని ప్రచారం
గాలించిన అటవీ శాఖ అధికారులు
జాడ లేదని తేల్చి చెప్పిన కోనసీమ డీఎఫ్‌వో ప్రసాద్

రావులపాలెం, సెప్టెంబరు 30: 'చిరుత సంచారంపై తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో 'గత 25 రోజులుగా గాలిస్తున్నాం... రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని లంక పొలాల్లో చిరుత కనిపించిందంటూ ప్రచారం జరిగింది. మేం వెళ్లి పరిశీలించగా దాని జాడ ఎక్కడా కనిపించలేదు' అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు తెలిపారు. రావులపాలెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రావులపాలెం గౌతమి గోదావరి సమీపంలోని లంక పొలాల్లో చిరుతను చూశానని చెప్పిన వ్యక్తితో కలిసి ఆ ప్రాంతానికి పడవలో వెళ్లి గాలించామన్నారు. అక్కడ చిరుత జాడలు కనిపించలేదన్నారు. ఆ మత్స్యకారుడిని పలుమార్లు ప్రశ్నించగా... ముందు దగ్గర నుంచి చూశానని, తర్వాత కదలికలను చూశానని చెప్పాడన్నారు. అక్కడి నుంచి వెళ్లి ఊబలంక పొలాల్లో కూడా చిరుత కోసం అన్వేషించగా జాడ కనిపించలేదన్నారు. 'చిరుత పులి పాదం 8 సెంటీమీటర్లు పైబడి ఉంటుంది. కుక్క పాదం కంటే పెద్దది. కుక్క గోర్లు గుచ్చి నడుస్తుంది. చిరుతపులి పాదం ఆన్చి నడుస్తుంది. ఇలా అన్ని కోణాల్లో పరిశీలించినప్పటికీ ఈ ప్రాంతంలో ఎక్కడా చిరుత జాడ కనిపించలేదు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లంక ప్రాంతాల్లోకి ఒంటరిగా కాకుండా ఇద్దరు, ముగ్గురు కలిసి వెళ్లాలి... చిరుత ఎదురైనా భయపడాల్సిన పనిలేదు. దానికంటే పెద్దజంతువుల పైన, ఎత్తుగా కనిపించే మనుషులపైన దాడి చేయదు' అని డీఎఫ్‌వో చెప్పారు. తనిఖీల్లో అధికారులు అమరనాథ్, దుర్గా రామప్రసాద్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో ప్రసాద్ →





రావులపాలెం గౌతమి వంతెన వద్ద చిరుత జాడను పరిశీలిస్తున్న అధికారులు



గౌతమి పరివాహక ప్రాంత లంక పొలాల్లో అధికారుల పరిశీలన


వాహనాలను కిరాయిలకు తిప్పేవారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురంటౌన్, సెప్టెంబరు30: సొంత వాహనాలను కిరాయికి తిప్పుతూ తమ పొట్ట కొడుతున్నారని ఆరోపిస్తూ జిల్లాలోని ట్యాక్సీ వెహికల్స్ ఓనర్లు, డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. బ్యాంకు రుణాలు తీసుకుని అప్పులుచేసి ఇన్సూరెన్సులు, ట్యాక్సులు చెల్లిస్తూ ట్యాక్సీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ పాలిట సొంత వాహనయజమానులు అమానుషంగా వ్యవహరిస్తున్నారన్నారు. వాహనాలను కిరాయికి తిప్పే వారిపై చర్యలు చేపట్టాలని తోట గణేష్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ అందించారు.

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- పట్టణంలో సెంటర్ల పేరుమార్పుపై కౌన్సిల్‌లో రగడ
- మున్సిపల్ దుకాణాల అద్దె బకాయిలపై ప్రశ్నలు

మార్చి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

మండపేట, సెప్టెంబరు 30: గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు మార్చి కల్లా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులను కోరారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల ఎక్స్ అఫిషియోసభ్యుడిగా మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మూడో దశలో కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరానని ఆయన చెప్పారు. వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపులు నిలుపుదల చేయాలని కోరినట్టు చెప్పారు. మున్సిపల్ దుకాణాలకు అద్దె బకాయిలు రూ.4కోట్లకు పేరుకుపోవడంతో ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ ప్రశ్నించారు. బకాయిదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు వారి ఫొటోలతో ఫ్లెక్సలను పట్టణ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. మున్సిపల్ పాఠశాలల రిపేర్లపై కౌన్సిల్ పెత్తనం లేకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. ఆస్తి మనదే



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

తప్ప పెత్తనం విద్యా శాఖదని అధికారులు సమాధానం చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మన స్కూళ్లపై విద్యా శాఖ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. నాడు నేడు పథకంలో విద్యా శాఖ పాఠశాలలు అభివృద్ధి చేసిందని కమిషనర్ చెప్పారు. ప్రధాన కూడళ్లకు నాయకుల పేర్లు పెడితే, వాటి పేర్లతో కాకుండా పూర్వ నుంచి వాడుకలో ఉన్న పేర్లతో పిలవటం తగదని వైసీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కోరారు. కలవపువ్వు సెంటరులో వేగుళ్ల వీర్రాజు విగ్రహం చుట్టూ కలవపువ్వు ఏర్పాటు చేయాలన్న వైసీపీ సభ్యుడు డిమాండ్‌ను టీడీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. మండపేటలో ప్రధాన కూడళ్ల వద్ద నాయకుల ఫ్లెక్సీలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులుగా కోరారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానం చెప్పారు. గతంలో కౌన్సిలర్‌గా పని చేసిన రామ్‌కుమార్ మున్సిపాల్టీలో అవినీతికి పాల్పడ్డాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ చుండ్రు సుబ్బారావు చౌదరి కోరారు. సమావేశంలో అజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. సమావేశంలో పట్టణంలో శానిటేషన్‌క సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. డీఈఈ శ్రీనివాస్. మున్సిపల్ వైస్ చైర్మన్లు, వేగుళ్ల నారయ్యబాబు, పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు కాశీన కాశీ విశ్వనాదం, యారమాటి గంగరాజు, కాళ్లకూరి స్వరాజ్యభవాని, శిరంగు జ్యోతి, గుండు రామతులసీ, మలసాని సీతారత్నం, కొవ్వాడ బేబి, చింతలపూడి దుర్గ, మందపల్లి రవికుమార్, రెడ్డి రాధాకృష్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా శిబిరం నిర్వహించారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన ధర్నా శిబిరాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) సందర్శించి మాట్లాడారు కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయరాదని డిమాండు చేశారు.వినతిపత్రాన్ని జేసీ టి.నిషాంతికి అందజేశారు. వివిధ సంఘాల నాయకులు పొలమూరి శ్రీను, ఎం.భాస్కరరావు, బండి వెంకటలక్ష్మి, వి.గణపతి, పి.ఏడుకొండలు, ఎంఎన్ శ్రీనివాస్, కె.ఆదిలక్ష్మి, కె.మహాలక్ష్మి, స్వాతి, కె.గీత, అంకం కనకదుర్గ, జార్జ్, సత్యనారాయణ, పరంధామయ్య పాల్గొన్నారు.

నెయ్యి కల్తీపై కళాకారుల నిరసన ప్రదర్శన

ద్రాక్షారామ, సెప్టెంబరు 30: తిరుమల లడ్డూ తయారీలో నెయ్యి కల్తీపై వెంకటేశ్వర, దుర్గాదేవి కోలసంబరం కళాకారులు సోమవారం రామచంద్రపురంలో ప్రదర్శన నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కళాకారులు గేయాలను ఆలపిస్తూ మేళతాళాలతో ప్రదర్శన జరిపారు. ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, భక్తుల మనోభావాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కోలసంబరం కళాకారుల కమిటీ అధ్యక్షుడు ఈతా దుర్గారావు, ఉపాధ్యక్షులు వాసంశెట్టి లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు షైగాపుల శ్రీను, పెద్దిరాజు,



వనుంకొండ కళాకారులు, గౌరవ అధ్యక్షుడు కోట శ్రీనివాస్, జనసేననాయకులు చిక్కాల దొరబాబు, ఎంపీటీసీ సభ్యులు చిక్కాల స్వామికాపు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదు 99.9శాతం



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి .బోసుబాబు

పి.గన్నవరం, సెప్టెంబరు 30: జిల్లా వ్యాప్తంగా ఈ-పంట నమోదు నూరుశాతం పూర్తయిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలో 1,57,716 ఎకరాలకు ఈ-పంట నమోదు పూర్తయిందన్నారు. పి.గన్నవరం మండలంలో కరార్లంక, పోతవరం, ఆదిమూలంవారిపాలెం, బోడపాటివారిపాలెం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదును తనిఖీ చేసి అనంతరం మాట్లాడారు. ఈకేవైసీ మాత్రం 93శాతం పూర్తయిందన్నారు. అక్టోబరు 1నుంచి 3 వరకు ఈ-పంట నమోదుపై అభ్యంతరాలనుఅర్జీల రూపంలో రైతులు అధికారులకు అందించవచ్చన్నారు. అక్టో బరు 7వరకు అర్జీలను పరిశీలన చేసి తుది జాబితాను ఆయా గ్రామాల్లో ప్రచురిస్తామన్నారు. అలాగే కార్యాలయంలో ఈపంట నమోదుపై ఏడీఏ ఎస్‌జేవీ మోహనరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కళ్యాణ్‌సూర్యకుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

4 నుంచి జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: హాకీ క్రీడాభివృద్ధిలో భాగంగా జాతీయ స్థాయిలో ఈనెల4 నుంచి హాకీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. న్యూఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ హాకీ టోర్నమెంట్ సొసైటీ శివాజీ స్టేడియంలో జరుగుతుంది. 41వ నెహ్రూ సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్ అండర్-15 బాలుర విభాగంలో అక్టోబరు 4నుంచి 14వరకు, 52వ అండర్-17 బాలుర పోటీలు అక్టోబరు 15 నుంచి 25వరకు, 30వ నెహ్రూ బాలికల హాకీ టోర్నమెంట్ అండర్-17 పోటీలు అక్టోబరు 26 నుంచి నవంబరు 6వరకు జరుగుతాయన్నారు. మూడు విభాగాల్లో రూ.3.06లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులు విజేతలకు అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7993329433ని సంప్రదించాలన్నారు.

లోకేశ్‌ను కలిసిన బండారు



కొత్తపేట, సెప్టెంబరు 30: విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం ఉండవల్లిలో ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సీనియర్ నాయకుడు ఆకుల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

యానాం, సెప్టెంబరు 30: యానాంలోని ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటడ్ (బ్యాంకు) ద్వారా 2023-24లో పది, ఇంటర్‌లో 95శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10వేలు, ప్రశంసాపత్రం అందజేశారు. బ్యాంకు మేనేజర్ కాశి అశోక్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ ధార్మిక సంస్థలకు అప్పగించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: హిందూ దేవాలయాల నిర్వహణను ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. మైనార్టీలు తమ సంస్థలు నడుపుకునేందుకు అనుమతి ఇస్తున్నారని హిందువులు దేవాలయాలను సొంతంగా నిర్వహించుకుంటే ఎందుకు అప్పగించరని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలని నినాదాలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, కోశాధికారి నూలు శ్యామల, భమిడిపాటి కృష్ణ



కలెక్టరేట్ ఎదుట విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన

మూర్తి, గొవ్వాల నాగరాజు, ఊటుకూరి సాంబయ్య, శిరంగు నాయుడు, పోలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో భారీ వర్షం



సబ్‌ట్రెజరీ కార్యాలయం లోపలికి చేరిన వర్షపు నీరు

ముమ్మిడివరం, సెప్టెంబరు 30: ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురవడంతో సోమవారం ముమ్మిడివరంలో పలు రోడ్లు వర్షం నీటిలో మునిగాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కురిసన వర్షం రోడ్లపై నిలిచి రోడ్లు, డ్రైన్లు ఏకమయ్యాయి. ఆసుపత్రి రోడ్డు, టెలిఫోన్ ఎక్సేంజ్ రోడ్డు, సుంకరవీధి, కుమ్మరివీధి వర్షపు నీటిలో మునిగాయి. స్కూళ్ల నుంచి ఇంటికి తిరిగి వచ్చే విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జీఎంసీ బాలయోగి కాలనీ, జగనన్న కాలనీలో అంతర్గత రోడ్లు నీట మునిగాయి. ముమ్మిడివరం సబ్‌ట్రెజరీ, తహసీల్దార్, పోలీసు స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయాలు నీట మునిగాయి. పోలీసుస్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో వర్షపునీరు ప్రవేశించింది. రాణిలంకలో హైస్కూలుకు వెళ్లే రోడ్డు కూడా నీట మునగడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. మురుగనీటి కాల్వలు, పంటకాల్వలు వర్షానికి పొంగి ప్రవహిస్తున్నాయి.

తల్లీ బిడ్డ ఆరోగ్యంతోనే నవ్య సమాజం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: తల్లీబిడ్డల ఆరోగ్యంతోనే నవ్య సమాజం ఆధారపడి ఉందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. జిల్లాస్థాయిలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించారు. పౌష్టికాహార లోపం వల్ల జరుగుతున్న తల్లీబిడ్డల మరణాలతో పాటు అనేక అంశాల్లో అధిగమించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి బాలింతలు, గర్భిణులకు అందించే కిట్ల గురించి తెలియజేశారు. 30 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యానాగేంద్రమణి, షేక్ అబ్దుల్‌ఖాదర్, ఏపీఎం ఎంవీఎల్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

తాతపూడి ముత్యాలుకు డాక్టరేట్



యానాం,సెప్టెంబరు 30: యానాం సర్వేపల్లి రాధాకృష్ణాన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ తాతపూడి ముత్యాలుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానంచేసింది. తూర్పు గోదావరి జిల్లాలో ప్రాథమిక విద్య విశ్లేషన్ అనే అంశంపై సీనియర్ ప్రొఫెసర్ దొమ్మేటి పుల్లారావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ప్రిన్సిపాల్‌డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, వివిధవిభాగాల అధిపతులు అభినందించారు.

చిరుత పాదముద్రలుగా అనుమానాలు

ఆత్రేయపురం, సెప్టెంబరు30: మెర్లపాలెంలంకలో సోమవారం సాయంత్రం చిరుత పులి పాదముద్రలు కనిపించాయని రైతు బొలిశెట్టి బూరయ్య చెప్ప డంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అవి చిరుతపులి అడుగులు కావని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో చిరుతపులి జాడ లేదని, వదంతులు నమ్మవద్దని అటవీశాఖ డివిజనల్ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆలమూరు ఎక్సైజ్ సీఐగా నాగేశ్వరరావు



ఆలమూరు, సెప్టెంబరు30: ఆలమూరు ఎక్సైజ్ సీఐగా ఐడీ నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎదుర్లంక చెక్‌పోస్ట్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన సత్యవేణి విజయవాడకు బదిలీపై వెళ్లారు. పలువురు సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఏడాది జైలు శిక్ష

అమలాపురం రూరల్, సెప్టెంబరు 30: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతికి కారకుడైన బస్సు డ్రైవర్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు సోమవారం తీర్పు చెప్పినట్టు తాలూకా సీఐ పి.వీరబాబు తెలిపారు. 2017 జూలై18న కాకినాడ శివారు ఇంద్రపాలానికి చెందిన కర్రి శ్రీనివాస్ (16), తూరంగికి చెందిన కర్రెడ్ల వీరబాబు(25) మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి ఏసీలు బిగించేందుకు మలికిపురం మండలం లక్కవరం బయలుదేరారు. జాతీయ రహదారిపై అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి వచ్చేసరికి అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో వీరబాబు చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పటి ఎస్ఐ ఎం.గజేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాజశేఖర్ ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు. బస్సు డ్రైవర్ చవ్వాకుల శ్రీధర్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ తెలిపారు.

అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సు

రాజోలు, సెప్టెంబరు 30: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ప్రతీ నెలాఖరున గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై మండలస్థాయి అధికారులు అవగాహన కల్పించాలని వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ తెలిపారు. సోంపల్లిలో గ్రామ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం సోమవారం జరిగింది. ఈసదస్సుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కుమారిదేవి హాజరయ్యారు. తహసీల్దార్, పోలీసులు, సోషల్‌వెల్ఫేర్ ఆఫీసర్ హాజరు కాకపోవడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అట్రాసిటీ అవగాహన సదస్సులను విస్మరిస్తున్న అధికారులపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఎంపీడీవో ఎస్.బాలాజీ, ఈవోపీఆర్డీ జి.భీమారావు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్వో తరుణ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి కె.గణపతిరావు, జేఏసీ నాయకులు విప్పర్తి సాయిబాబు, శంకరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిందాడమడుగు చారిత్రక ప్రాధాన్యం కాపాడాలి

అమలాపురంరూరల్, సెప్టెంబరు30: కోనసీమ రైల్వేలైన్ నూతన అలైన్‌మెంట్‌లో భాగంగా జరుగుతున్న నష్టాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాల సర్పంచ్‌లు సోమవారం క్యాంపు కార్యాలయంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వేలైన్ వల్ల చిందాడగరువు నుంచి పన్నెండు గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే ఆర్‌డబ్ల్యూఎస్ మేజర్ వాటర్ ప్రాజెక్టు దెబ్బతింటుందన్నారు. చిందాడగరువు, ఇమ్మిడివరప్పాడు, రోళ్లపాలెం, తాండవపల్లి సర్పంచ్‌లు పొణకల గణేష్, రేలంగి దుర్గారావు, గంగుమళ్ల ఏసుబాబు, మట్టా సాయిరామారావు తదితరులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాఘవేంద్రరావు



పి.గన్నవరం, సెప్టెంబరు 30: పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ యు.రాఘవేంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డెంటల్ వైద్యులు కోటేశ్వరరావు సూపరింటెండెంట్‌గా సేవలు అందించారు. తోటి వైద్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడానికి సహకరించాలని వైద్యులు, సిబ్బందిని ఆయన కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 30: ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. నగరం ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్సు ప్రాంగణంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, పార్టీ నాయకులు జాలెం శ్రీనివాసరాజా, మెండా ఆదినారాయణ, ఓఎన్జీసీ ఏరియా మేనేజర్ కేజేఎం రావు, ఇనిస్టిలేషన్ మేనేజర్ ఎంవీఆర్ శివకుమార్, ప్రెసిడెంట్ ఇంజనీర్ హరికేష్‌రెడ్డి, నాయకులు అడబాల తాతకాపు, బోనం బాబు, జాలెం సుబ్బారావు, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. లూటుకుర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బోనం సత్యరాజు అందించిన మొక్కలను ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌అడబాల తాతకాపు, బోనం బాబు, ఇళ్ల సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



అమలాపురం రూరల్, సెప్టెంబరు 30: ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కడిమి నాని, జల్లి జితేంద్ర రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటారు. అండర్-17, 19విభాగాల్లో రజత, కాంస్య పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ వి.నరసింహారావు తెలిపారు. క్రీడాకారులను హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ రాజారమేష్, సర్పంచ్ చొల్లంగి శివాళిని-అప్పాజీ, గుబ్బల పెద్దిరాజు అభినందించారు.

రాష్ట్ర పోటీలకు మునిపల్లి బాలిక



ఉప్పలగుప్తం, సెప్టెంబరు 30: మునిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థిని బి.లావణ్య అండర్-17 విభాగంలో సోమవారం జరిగిన జిల్లా పోటీల్లో ప్రతిభ చూపి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం యాగా ఏడుకొండలు తెలిపారు. విజయనగరంలో జరిగే రాష్ట్ర పోటీల్లో లావణ్య పాల్గొంటుందన్నారు. హెచ్ఎంతో పాటు పీఎంసీ చైర్మన్ వై.కిరణ్, పీడీ ఎన్.సీతాపతి, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు లావణ్యను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రాజోలు, సెప్టెంబరు 30: రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మౌనిక యోగాలో, త్రిపుర యజ్ఞేశ్వరి విలువిద్యలో, జె.ధర్మ బాక్సింగ్‌లో జిల్లాస్థాయి అండర్-19 క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతికుమారి తెలిపారు. కళాశాలలో సోమవారం విద్యార్థులను దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అధ్యాపకులు కె.గణేశ్వరరావు, డి.నాగమణి, ఎన్ఎస్ఎస్ పీవో జె.రాజబాబు, కళాశాల ఇన్‌చార్జి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.అంబేడ్కర్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 30: రామచంద్రపురం పట్టణం గుబ్బలవారిపేటకు చెందిన గుబ్బల బాలవెంకటకృష్ణను ఆదివారం పోక్సో కేసులో అరెస్టు చేసినట్టు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. గుబ్బల బాల వెంకటకృష్ణ కళాశాలలో చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానని వెంట పడ్డాడు. గత నెల16న మధ్యాహ్నం బాలిక ఒంటరిగా ఇంట్లో ఉండగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై లైంగికదాడి చేశాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈనెల29న చింతపల్లి సూరన్ననగర్‌లో బాలవెంకటకృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు30: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన మేడపాటి భీమారెడ్డి-భవాని దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈవో నల్లం చక్రధరరావు దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.1,47,763 లభించినట్టు ఈవో తెలిపారు.

ఆక్వా సాగుకు అనుమతించి ఆదుకోండి

రాజోలు నియోజకవర్గ తీర ప్రాంత ఆక్వా రైతులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30: సముద్రం కిలోమీటరు ముందుకు రావడంతో పంచాయతీ సీసీ రోడ్డు సైతం సముద్ర గర్భంలో కలిసిపోయిందని జిరాయితీ భూముల్లోకి సముద్రపు ఉప్పునీరు ప్రవేశించి ఏవిధమైన పంటలకు అవకాశం లేకుండా భూములు చౌడు బారిపోతున్నాయని రాజోలు నియోజకవర్గ తీర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం వారు నిరసన తెలిపారు. 30ఏళ్లుగా ఆ భూముల్లో రొయ్యల చెరువులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆక్వా సాగుకు అనుమతించాలని పి.నరసింహారావు, బి.నాగరాజు తదితరుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

మెప్మా బజార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 30: మండపేటలో మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ప్రారంభించారు. మహిళా సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, పిండి వంటలను ఇక్కడ స్టాల్ ఏర్పాటుచేసి విక్రయించారు. మహిళలు తమ కాళ్లపై నిలబడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వేగుళ్ల అన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, కమిషనర్ రంగారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా చుండ్రు జన్మదిన వేడుకలు

మండపేట, సెప్టెంబరు 30: టీడీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక బాబుఅండ్‌బాబు కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నేతలు, అభిమానులు నడుమ జరుపుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రకాష్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మయూరి వృద్ధాశ్రమం, ప్రభుత్వాసుపత్రుల్లో పండ్లను పంపిణీ చేశారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా దివ్యాంగుల రిలే దీక్ష

మామిడికుదురు, సెప్టెంబరు 30: పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం వద్ద దివ్యాంగులు సోమవారం ఒకరోజు రిలే దీక్ష చేశారు. ఈదీక్షా శిబిరాన్ని జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, పి.గన్నవరం సర్పంచ్‌ల సమాఖ్యసంఘ అధ్యక్షుడు అడబాల తాతకాపు, కంకిపాటి నరసింహారావు సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు కొమ్ముల కోటేశ్వరరావు, బొమ్మిడి నరసింహస్వామి,చిట్టూరి రాంబాబు, కోడేటి పాండురాజు, కట్టా త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పాదయాత్ర

రాయవరం, సెప్టెంబరు 30: తిరుమల లడ్డూ ప్రసాదంలో జరిగిన నెయ్యి కల్తీపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు సోమవారం పాదయాత్ర చేశారు. సోమేశ్వరం నుంచి రాయవరం వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు నాయకులు పాదయాత్రగా వెళ్లారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు కూటమి నాయకులు వుండవల్లి రాంబాబు, నాగేంద్ర, దేవిశెట్టి చిన్ని, శాకా శ్రీనివాసు, లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, నరాల రాంబాబు, ముష్టి శ్రీదేవి పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, సెప్టెంబరు 30: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. భాద్రపద మాసశివరాత్రి సందర్భంగా లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. ఆలయ పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడిగా నాగరాజు

అంబాజీపేట, సెప్టెంబరు 30: మాలమహానాడు మండల అధ్యక్షుడిగా అంబాజీపేటకు చెందిన నాగవరపు నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబాజీపేట జయంతినగర్‌లోని వ్యవసాయ క్షేత్రంలో జరిగిన 16గ్రామాల దళిత నాయకుల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నెల్లి వెంకటరమణ, సెక్రటరీగా నాగాబత్తుల సుధాకర్, జాయింట్ సెక్రటరీగా బీర సురేష్, కోశాధికారిగా కోట హనుమంతరావు, సభ్యులుగా గోసంగి కుమారస్వామి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో షైలా ఆనందరావు, నూకపెయ్యి చిన్న, ముత్తాబత్తుల ప్రశాంత్, పులిదిండి పండు, నాగవరపు అన్నవరం, కోట విజయరాజు పాల్గొన్నారు.

2న కణ్వమహర్షి పిరమిడ్ ధ్యానమందిరం ప్రారంభం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 30: అంగర, పడమరఖండ్రిక ఉయ్యాల - జంపాల క్షేత్రం వద్ద నూతనంగా నిర్మించిన కణ్వమహర్షి పిరమిడ్ ధ్యాన మందిరాన్ని బుధవారం 109ఏళ్ల హిమాలయ యోగి సంత సదానందగిరి మహరాజ్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ధ్యానమందిరం వద్ద పిరమిడ్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిక్కం రాంబాబు (పద్మాలయ స్టూడియో), వల్లూరి వీరవెంకట సత్యనారాయణచౌదరి ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడారు. గ్రంథాలయాన్ని ఎన్.అన్నపూర్ణ విజయ భాస్కరరెడ్డి దంపతులు, బుద్ధ విగ్రహాన్ని పూజ్యబంతే అనాలయో ప్రారంభిస్తారన్నారు. కమిటీ మెంబర్లు, గ్రంధి కనకపండు, చీకట్ల రమణ, జె.రమణ, శలా బ్రహ్మయ్య, యర్రంశెట్టి గణేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 30: ఉచిత డీఎస్సీ శిక్షణ పొందిన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని మంత్రి సుభాష్ కోరారు. సోమవారం స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఉచిత డీఎస్సీ శిక్షణ పొందిన అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు, స్టడిమెటీరియల్ అందజేసి అభ్యర్థులతో మంత్రి సుభాష్ ముచ్చటించారు. సీఎం చంద్రబాబు 16,437 ఉపాధ్యాయ పోస్టుల నోటిఫికేషన్‌పై తొలిసంతకం చేశారన్నారు. నిరుపేద విద్యార్థుల కోసం 45రోజులు ఉచితంగా టెట్, డీఎస్సీ కోచింగ్ ఇచ్చామన్నారు. సమావేశంలో కేవీఆర్ ఆసుపత్రి వైద్యులు కోట సతీష్‌కుమార్, వీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా కాత్యాయని, ఎస్ఐగా అన్నవరం





కొత్తపేట, సెప్టెంబరు 30: కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా కె.కాత్యాయని, స్టేషన్ ఎస్ఐగా కె.అన్నవరం సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాత్యాయని ఆకివీడు నుంచి బదిలీపై కొత్తపేట సీఐగా వచ్చారు. కాకినాడ జిల్లా మల్లవరం మొబైల్ పార్టీ ఎస్ఐగా ఉన్న అన్నవరం బదిలీపై కొత్తపేట ఎస్ఐగా వచ్చారు.

ఎలక్ట్రికల్ ఏఈగా నరేష్



రావులపాలెం, సెప్టెంబరు 30: రావులపాలెం విద్యుత్‌శాఖ ఏఈగా పి.నరేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కొత్తపేట నుంచి రావులపాలెం బదిలీపై వచ్చారు.

ట్రాన్స్‌కో ఏఈగా దుర్గాప్రసాద్



ఆలమూరు, సెప్టెంబరు30: ఆలమూరు మండల ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజనీర్‌గా దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా ఇన్‌చార్జులుగా ఏఈలు పనిచేశారు. రాజమహేంద్రవరంలో స్టోర్స్ ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్‌ను ఆలమూరు ఏఈగా నియమించారు.

భర్త అదృశ్యంపై మహిళ ఫిర్యాదు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 30: బండారులంక శివారు కందులపాడుకు చెందిన చింతా త్రిమూర్తులు(53) సెప్టెంబరు 27నుంచి కనిపించడం లేదని భార్య సూర్యావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సోమవారం తెలిపారు. త్రిమూర్తులు స్థానికంగా కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. వ్యాపారం సరిగా ఉండడం లేదని ఇక చేయలేనని ఈనెల27వతేదీ రాత్రి భార్యకు చెప్పడంతో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. 28వ తేదీ ఉదయం లేచి చూసేసరికి భర్త కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 30: రెడ్డిపల్లిలో ఈనెల 29న ఆలయం వద్ద సీరియల్ లైటు దండలు వేస్తుండగా పైనుంచి వెళుతున్న 11కేవీ వైరు తగలడంతో అమలాపురం శ్రీరామ్‌పురానికి చెందిన కట్టా శ్రీనివాసరావు(50) కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి శ్రీనివాసరావు మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు.

రూ.6లక్షలు విలువైన ఆయిల్ స్వాధీనం

ఐ.పోలవరం, సెప్టెంబరు 30: యానాం నుంచి అక్రమంగా అంబాజీపేట తరలిపోతున్న ఆయిల్ ట్యాంకర్‌ను సోమవారం ఐ.పోలవరం పోలీసులు పట్టుకున్నారు. రూ.6లక్షలు విలువైన 5,500లీటర్ల ఆయిల్ ట్యాంకర్ ఉన్నట్టు గుర్తించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు.

గోడిలంక ప్రమాద మలుపుపై స్పందనలో ఫిర్యాదు

అల్లవరం, సెప్టెంబరు30: బెండమూర్లంక ఆర్‌అండ్‌బీ రహదారిలో గోడిలంక ఆంజనేయ స్వామి గుడి మలుపు వద్ద వాహన ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బీఎస్ఎస్ కృష్ణమోహన్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ప్రమాద మలుపును మార్చేలా చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేశారు.